# వారధి నిర్మాణం జరిగేనా?






ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ దాటుతున్న కోసంగి, పెద్దపాడు గిరిజనులు

## గెడ్డలు దాటాల్సిందే

మండలంలోని పోతంగి పంచాయతీ పెద్దపాడు, కోసంగి, చంపాపట్టి, శీలంగొంది, ఊయాలగుడ, జాంకరుగుడ, కించుమండల పంచాయతీ కొసోంగుడ, కంభవలస వంటి గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగించాలంటే గెడ్డలు దాటక తప్పడం లేదు. అందులో వర్షకాలంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, నిత్యావసర సరకులు కోసం సంతలకు, మండల కేంద్రానికి వెళ్లే గిరిజనులు ఉధృత గెడ్డలతో దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



హుద్‌హుద్ తుపానుకు కొట్టుకుపోయిన చంపాపట్టి వంతెన

**డుంబ్రిగుడ: గిరిజనులకు వర్షాకాలంలో ఆగచాట్లు తప్పడం లేదు. గిరిజన గ్రామాలకు సరైన రహదారులు లేక రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక గెడ్డలు, వాగులు దాటి ప్రయాణాలు సాగిస్తుంటారు. వర్షాలు కురిసినపుడు గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవు. ఇలాంటి సమయాల్లో తప్పని పరిస్థితుల్లో అత్యవసర సేవల కోసం ప్రాణాలకు తెగించి గెడ్డలు దాడుతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు గిరిజనులు గెడ్డలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నారు.** మన్యంలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. గెడ్డలపై వంతెనలు నిర్మించాలని వేడుకుంటున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు కనీసం స్పందించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చంపాపట్టి వంతెనకు మోక్షమెన్నడో**

చంపాపట్టి వద్ద 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపాను ప్రభావంతో వంతెన కొట్టుకుపోవడంతో చంపాపట్టి, శీలంగొంది, జాంకరవలస తదితర గ్రామాలకు నేటి వరకు వంతెనకు మోక్షం లభించలేదు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పటికీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇక్కడి వంతెన నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రమాదకర గెడ్డలపై సాహస ప్రయాణం
- తప్పని పరిస్థితుల్లో వాగులు దాటుతున్న వైనం
- మృత్యువాతకు గురవుతున్న గిరిజనం
- పట్టించుకోని యంత్రాంగం



ఉధృతంగా ప్రవహిస్తున్న చాపరాయి గెడ్డ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోఇక్కడి వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉండగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిధులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మన్య ప్రాంతంలో ఒక్క **అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ప్రమాదకర వాగులపై వంతెన నిర్మాణం చేయాలని గిరి**జనులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ వద్ద ప్రస్తావించగా గెడ్డలపై వంతెనల నిర్మాణ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని. ప్రతిపాదనలు పంపామన్నారు.

### వంతెన నిర్మాణాన్ని విస్మరించిన ఉప ముఖ్యమంత్రి

మండలంలో చాపరాయి ప్రాంతాన్ని ఏప్రిల్ 7న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. పర్యటనలోభాగంగా గెడ్డ దాటి పెద్దపాడు గ్రామంలో పర్యటించారు. పెద్దపాడు నుంచి కోసంగి గ్రామాలకు సంబంధించి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అయితే ఆయా గ్రామాల మధ్య ఉన్న చాపరాయి గెడ్డపై వంతెన గురించి పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. గెడ్డకు ఇరువైపులా నాలుగు గ్రామాలున్నాయి. ఆయా గ్రామస్తులు రోజూ గెడ్డ దాటి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకర చాపరాయి గెడ్డ దాటుతూ పలువురు మృత్యువాతకు గురైన సంఘటనలున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆయా గ్రామాలకు అనుసంధానం చేసే చాపరాయిపై గెడ్డపై వంతెన గురించి ఉప ముఖ్యమంత్రి తన పర్యటనలో కనీసం ప్రస్తావించలేదని పలువురు చెబుతున్నారు. వంతెన సమస్యను ఉప ముఖ్యమంత్రికి విన్నవించేందుకు కూడా కూటమి నాయకులు, ఉన్నతాధికారులు అడ్డుపడి అవకాశం ఇవ్వలేదని స్థానికులు చెబుతున్నారు. వంతెన విషయమై ఉపముఖ్యమంత్రి ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం గురించి ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డపై వంతెను లేక అత్యవసర పరిస్థితుల్లో పలు గ్రామాల మీదుగా చుట్టూ తిరిగి కిలోమీటర్ల దూరం ప్రయాణించి, అరకులోయ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు.



ఉధృత గెడ్డను చూపిస్తున్న సర్పంచ్ వెంకటరావు

### వంతెన నిర్మించాలి



గతంలో మా గ్రామంలో గర్భిణిని ఆస్పత్రికి తరలించేందుకు గ్రామానికి 108 రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో గెడ్డ దాటించి సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాం. అయిన పురిటిలోనే బిడ్డ చనిపోవడవం చాలా బాధాకరం. ప్రమాదకర గెడ్డలు దాటేందుకు గిరిజనులు సాహించాల్సి వస్తోంది. మండల కేంద్రం సమీపంలోని ఉన్న పోతంగి పంచాయతీ కోసంగిలో దుస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామస్తుల పరిస్థితిని ఊహించలేకపోతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి గెడ్డపై వంతెన నిర్మించాలి.

– **వంతాల వెంకటరావు,** కోసంగి గ్రామం, సర్పంచ్, పోతంగి పంచాయతీ

### నిత్యం సాహసం



ప్రమాదకర గెడ్డలు దాటడం గ్రామస్తులకు నిత్యం సాహసంగా మరింది. చిన్న కష్టం వచ్చినా మండల కేంద్రానికి గెడ్డ దాటుతు వెళ్లక తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు. ఒక్క గిరిజన గ్రామంలో వంతెన, రోడ్డు నిర్మాణం చేసిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకర గెడ్డపై వంతెనలు నిర్మించి కష్టాల నుంచి విముక్తి కల్పించాలి.

– **మఠం శంకర్‌రావు,** కోసంగి గ్రామం, పోతంగి పంచాయతీ



చాపరాయి వద్ద గెడ్డ దాటుతున్న పెద్దపాడు గిరిజనులు



అత్యవసర వైద్యం కోసం రోగిని గెడ్డదాటిస్తున్న గిరిజనులు

## క్లుప్తంగా

### 8న వైఎస్సార్ జయంతి

**గూడెంకొత్తవీధి:** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సామూహిక సీమంతాలు



సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

**రంపచోడవరం:** రంపచోడవరం యూనియన్ బ్యాంకు ఆవరణలో ఆదివారం దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన పూజారులతో 126 మందికి సామూహిక సీమంతాలు జరిపించారు. భద్రాద్రి కొత్తగూడెం, అనకాపల్లి శోహం ఆశ్రమ పీఠాధిపతులు అరుణానంద స్వామిజీ ముందుగా తొలి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. అనంతరం సీమంతం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పసుపు, కుంకుమ, చీర, గాజులు పండ్లు, పూలు, స్వీట్లు అందించి ఆశీర్వదించారు. ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్. వెంకటేశ్వరరావు, ధానధర్మ ట్రస్ట్ ప్రతినిధులు వెంకట్, వరలక్ష్మి, పూజార్లు మోహనరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### రోడ్డు పనులు వేగవంతంగా చేయాలి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మీనా, ఎంపీటీసీ భానుమతి

**పాడేరు రూరల్:** మండలంలో వనుగుపల్లి, పంచాయతీ పరిధిలోని బెన్నడబంధ, గడ్డిబంధ, తియ్యగెడ్డ, చీడిపాలెం గ్రామాలకు రోడ్డు పనులకు సర్పంచ్ ఎం.మీనా, ఎంపీటీసీ సభ్యురాలు భానుమతి ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాలు కావడంతో సరైన రోడ్డు లేక ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో శివారు ప్రాంత గిరిజనులకు రవాణా సౌకర్యం కలుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు పూలదండలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. నాయకులు ఆనంద్, రాజబాబు, సింహాచలం, ఈశ్వర్‌రావు, బాలకృష్ణ, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న వరలక్ష్మి

**రంపచోడవరం:** రంపచోడవరం సమీపంలోని సీతపల్లి వద్ద నెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. సుమారు 46 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నట్టు నిర్వాహకులు సోదే వినోద్‌కుమార్, ధర్మకుమార్ తెలిపారు. టోర్నీ ఫైనల్‌కు లొద్దిపాలెం, దేవీపట్నం జట్లు చేరుకున్నాయి. విజేతగా నిలిచిన లొద్దిపాలెం జట్టుకు రూ.10వేలు, దేవీపట్నం జట్టుకు రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు. పండా వరలక్ష్మి విజేతలకు కప్‌ను అందజేశారు. కె.బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

### వాహన తనిఖీలు



వేటమామిడిలో వాహన తనిఖీలు చేస్తున్న సీఐ నరసింహమూర్తి తదితరులు

**అడ్డతీగల:** మండలంలోని వేటమామిడి జంక్షన్‌లో ఆదివారం సిఐ బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆయా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనంతరం రికార్డులను పరిశీలించారు. వాహన యజమానులు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ నరసింహమూర్తి అన్నారు. యువతకు కేరీర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని సూచించారు. గంజాయి కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



అడ్డతీగలలో పూజలు చేస్తున్న భక్తులు

**అడ్డతీగల:** తొలి ఏకాదశి పురస్కరించుకొని అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో బాలాజీ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. స్వామి వారికి తులసి, పూలమాలలు సమర్పించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో భక్తులచే పూజలు గావించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. తొలి ఏకాదశి విశిష్టతను భక్తులకు తణుకు వెంకటరామయ్య వివరించారు.



చింతపల్లి రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**చింతపల్లి:** మండలంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు అన్ని ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆషాఢమాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయం, రామాలయం, అనాదీశ్వర శివాలయం, సాయిబాబా ఆలయంతో పాటు బౌడ, మడిగుంట, లోతుగెడ్డ, రాజుపాకలు, కొత్తపాలెం, వంగసార శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు హాజరై ప్రత్యేకంగా కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు

**ముంచంగిపుట్టు:** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు అన్నారు. మండలంలోని రంగబయలు, వనుగుమ్మ పంచాయతీల్లో సీఐటీయూ నాయకులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తుందని, కార్మికుల హక్కులు, చట్టాలను నాశనం చేస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు చండల్, సుబ్బారావు, పండు, కాశి, సుకదేవ్, బుద్దు, రాంచందర్, గాసిరాం తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో వర్గ విభేదాలు

- పార్టీ మండల కమిటీ ఎన్నిక పాడేరులో జరపడం బాధాకరం
- టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ



చింతపల్లి మాట్లాడుతున్న టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ

**చింతపల్లి:** పాడేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిశీలకులు వ్యవహరిస్తున్న తీరు వర్గ విభేదాలను సృష్టించడంతో పాటు పార్టీ మనుగడ నష్టపరిచే విధంగా ఉందని మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బేరా సత్యనారాయణ ఆరోపించారు. చింతపల్లిలో ఆదివారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ గ్రామ కమిటీ నుంచి మండల కమిటీ వరకూ కేవలం ఒక వర్గానికి చెందిన వారికి మాత్రమే కట్టబెట్టడానికి పరిశీలకులు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ గ్రామస్థాయి పంచాయతీలోను, మండల స్థాయి ఎన్నికలు మండలంలో నిర్వహిస్తున్న ఆనవాయితీని పక్కనపెట్టి మండల కమిటీ ఎన్నిక పాడేరు నియోజకవర్గ కేంద్రంలో పరిశీలకుడు నాగ జగదీష్ నిర్వహించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పార్టీలో సమర్థులైన నాయకులు ఉన్నప్పటికీ గత ఐదు సంవత్సరాలుగా మండల అధ్యక్షుడిగా ఉన్న వారికే మళ్లీ అధ్యక్ష పదవిని కట్టబెట్టడం దురదృష్టకరమన్నారు. నియోజకవర్గ పరిశీలకుడి తీరును ఖండిస్తూ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. మండల నూతన కమిటీ నియమించాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మయ్య, రమణ, దేముడు పాల్గొన్నారు.

### బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



అడ్డతీగలలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**అడ్డతీగల:** మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర సమరయోధుడిగా, భారత దేశ తొలి ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ సమసమాజ స్థాపన కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని దంగేటి సత్తిబాబు అన్నారు. దేశాభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి అన్నారు. స్థానికులు పాల్గొన్నారు.

### ముగిసిన జగన్నాథ రథోత్సవాలు

**మాడుగుల:** ఈ నెల 28 నుంచి ప్రారంభమైన జగన్నాథ రథోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. స్థానిక ఇంద్రజ్యుమ్నం వద్ద దశావతారాలు పూర్తి చేసుకుని తిరిగి ఆదివారం మలివిడత రథోత్సవాల్లో భాగంగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రజ్యుమ్నం వద్ద దాతల సహాయంతో అన్న సమారాధన జరిపారు. స్వామి వారి రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. మలివిడత రథోత్సవంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

### కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి



గంగవరంలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న అప్పన్నబాబు

**గంగవరం:** పెంపుడు కుక్కలకు విధిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని నెల్లిపూడి గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక అప్పన్నబాబు కోరారు. జునోసిస్ డే సందర్భంగా మండలంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా అప్పన్నబాబు మాట్లాడుతూ ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ రేబిస్ టీకా కనుగొన్న దినాన్ని పురస్కరించుకొని జూలై 6 జునోసిస్ డేను జరుపుకుంటారన్నారు. మనుషులకు పశుపక్షాదులతో సంబంధం కలిగి ఉండడం వల్ల వాటికి వచ్చే రేబిస్, బసెల్లోసిస్, అంత్రాక్స్ వంటి వ్యాధులు మనుషులకు అలాగే మనుషుల నుంచి పశువులకు సంక్రమించే వ్యాధులను జోనోటిక్‌గా అభివర్ణిస్తారన్నారు. ఈ వ్యాధులకు చికిత్స కంటే నివారణ మేలు అని ఆయన చెప్పారు. ఇందుకోసం ముందస్తుగా పశువులకు వ్యాక్సిన్‌లు వేయాలని, దీంతో వ్యాధులు సంక్రమించకుండా కాపాడుకోవచ్చన్నారు. జోనోసిస్ డేను పురస్కరించుకొని జులై 6 న పశుసంవర్ధక శాఖ పెంపుడు కుక్కలకు సమీప పశువైద్యశాలల్లో రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తారని పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 8న అరకులోయలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

**అరకులోయ టౌన్:** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలుచేయకుండా గాలికి వదిలేసిందన్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలపై నియోజకవర్గ స్థాయి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నామని, విజయవవంతం చేయాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అరకులోయ మండల పరిధిలో గల టీటీడీ ఫంక్షన్ హాల్ వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**డుంబ్రిగుడ:** అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో అరకులోయలోని ఈనెల 8న నిర్వహించే బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి, ఉమ్మడి జిల్లాల చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ తదితరులు హాజరుకానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు పరామర్శ



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న అరకు ఎంపీ దంపతులు



గణేష్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

**నర్సీపట్నం :** సీజనల్ వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందుతున్న నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను అరకు పార్లమెంట్ సభ్యులు జి.తనుజారాణి, భర్త వినయ్, అరకు ఎమ్మెల్యే రేగం మత్సలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అనకాపల్లి జిల్లా పార్టీ పరిశీలకులు శోభా హైమావతి, ఏఎస్ఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు ఆదివారం పరామర్శించారు. ఆరు రోజులుగా విష జ్వరంతో బాధపడుతున్న గణేష్ విశాఖ మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో గణేష్‌ను పరామర్శి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

### కొనసాగిన సప్తాహం

**మునగపాక:** స్థానిక షిరిడీసాయి బాబా ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహం ఆదివారం మూడోరోజు కొనసాగింది. పలు గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు సాయిగీతాలను ఆలపించారు. ఉదయం నుంచి భక్తులు సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఈ నెల 10న ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తెలిపారు.